నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 20 జనవరి 2025 | KAMAREDDY



బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, నాయకులు అలీం, బాజిరెడ్డి జగన్

## దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ కవిత డిమాండ్
- ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేత

కంఠేశ్వర్, జనవరి 19: తెలంగాణ సాయుధ పోరాటానికి జవసత్వాలు నింపిన ప్రజాకవి, కలం యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదివారం ఆమె వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని, దాశరథి జన్మస్థలం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో స్మృతివనం ఏర్పాటు చేయడంతోపాటు గ్రామస్తులు ఏర్పాటుచేసుకున్న గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని కోరారు. దాశరథి సాహిత్యాన్ని ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. శతజయంతి ఉత్సవాల ముగింపును గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించాలని కోరారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కవిత

# అర్వింద్.. వెకిలి మాటలు మానుకో!

పసుపు బోర్డు కోసం 2014 నుంచే పోరాటం

- పసుపునకు ఎమ్మెస్పీ, జక్రాన్‌పల్లికి ఎయిర్‌పోర్ట్ తీసుకురా..
- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై మండిపడిన ఎమ్మెల్సీ కవిత
- ప్రతి మూడేండ్లకు పసుపు ధర పెరగడం సాధారణ ప్రక్రియనే..
- తన గొప్పతనంగా ఎంపీ అర్వింద్ చెప్పుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్య

నిజామాబాద్, జనవరి 19, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తన మాటలతో రైతులు, ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై విరుచుకుపడ్డారు. గాలిమాటలు మాట్లాడడం మానేసి పసుపునకు మద్దతు ధర సాధించాలని ఎంపీ అరవింద్‌కు సూచించారు. స్పైసెస్ బోర్డును బెంజ్ కారులాంటిదని, పసుపు బోర్డు అంబాసిడర్ కారు లాంటిదని గతంలో అర్వింద్ అన్నారని, పసుపును అవహేళన చేసిన అర్వింద్‌కు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఎంపీ అర్వింద్‌కు వెకిలి మాటలు మాట్లాడడం అలవాటని, తాము పసుపు బోర్డు డిమాండ్ చేసిన నాటికి అర్వింద్ అసలు రాజకీయాల్లో కూడా లేరని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన తండ్రి చాటు బిడ్డగా ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని అర్వింద్ బాండ్ పేపర్‌పై రాసిచ్చారు. ఎంపీగా గెలిచిన తర్వాత పసుపు బోర్డు కంటే స్పైసెస్ బోర్డే బాగుంటుందని ఆయన అన్నారు. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిది, పసుపు బోర్డు అంబాసిడర్ కారు లాంటిదని అన్నారు. ఒకవేళ బెంజ్ కారు ఉంటే అంబాసిడర్ కారు ఎందుకు ఇచ్చినట్లు ? ఎందుకు ఇంత వైరాధ్యంతో మాటలు చెబుతున్నారు ? ఎంపీ గాలి మాటలు మాట్లాడడం మానేయాలని మండిపడ్డారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడంతోనే గతంలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని అర్వింద్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఎవరు ఏం చేయకున్నా ప్రతి మూడో సంవత్సరం పసుపు ధర పెరుగుతుందని, కానీ అది తన ఘనత అని ఎంపీ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద గతంలో కేసీఆర్ 42 ఎకరాలు కేటాయించారని, ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించిందని, అక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్‌ను డిమాండ్ చేశారు. పసుపు బోర్డును ఏర్పాటు చేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. పలువురు ముఖ్యమంత్రులను కలిసి పసుపు బోర్డు ఏర్పాటుకు మద్దతుగా లేఖలు సేకరించాను. పీఎం మోడీని రెండు సార్లు కలిసి బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశానని, పార్లమెంట్‌లో అనేకసార్లు మాట్లాడడమే కాకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటూ ప్రైవేట్ మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టానని వివరించారు. ఇలా తాను గతంలో త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని ఎమ్మెల్సీ కవిత స్పష్టంచేశారు.



### రూ.15వేలు మద్దతు ధర ఏది?

క్వింటాలు పసుపునకు రూ.15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణన్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. తూతూ మంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు పరిశోధన సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు. పసుపు బోర్డునే ఏర్పాటు చేయాలని తాము కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అర్వింద్ రాజకీయాల్లో కూడా లేదని విమర్శించారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, ప్రొటోకాల్‌ను పాటించలేదని, ఇది ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధమన్నారు. కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని.. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రెస్‌మీట్ అనంతరం ఎమ్మెల్సీ కవితకు పసుపు కొమ్ములతో తయారు చేసిన దండతో పలువురు బీఆర్ఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నేతలు సుజిత్ సింగ్ ఠాకూర్, బాజిరెడ్డి జగన్, సిర్ప రాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశం

# సమాధానం లేని సమీక్ష!

- లోపాలను ఎత్తిచూపిన బీఆర్ఎస్, బీజేపీ ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి వ్యవసాయాధికారిపై ఎమ్మెల్యే వేముల మండిపాటు
- ఆర్మూర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహించిన మానాల మోహన్ రెడ్డి
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై రివ్యూ
- మూడు గంటల సమావేశంలో ప్రేక్షక పాత్రకే పరిమితమైన అధికార యంత్రాంగం



సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు



సమీక్షా సమావేశంలో ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, జనవరి 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కంఠేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాల తీరుతెన్నులపై నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులతో ఆదివారం నిర్వహించిన సమన్వయ సమావేశం సమాధానం లేని సమీక్షగానే ముగిసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులంతా హాజరైన ఈ మీటింగ్ ఆద్యంతం వాడీవేడిగా సాగింది. మూడు గంటల సమావేశంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులంతా అడుగడుగునా ఆయా పథకాల లబ్ధిదారుల గుర్తింపులో లోపాలు, సమస్యలను ఎత్తి చూపారు. వాటిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సావధానంగా విని, చివరగా సమాధానాలు చెప్పినప్పటికీ వాటిల్లో స్పష్టత కొరవడిందని సమీక్షకు హాజరైన వారంతా అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకులకే చోటు కల్పించారని, తాము ప్రతిపాదించిన వ్యక్తులను పక్కకు పెట్టారంటూ ఎమ్మెల్యేలు చెప్పారు. దీనిపై మంత్రి క్లారిటీ ఇవ్వలేదు. పథకాలకు అర్హుల గుర్తింపులో ప్రస్తుతం ఉన్న ఆదాయ పరిమితిని పెంచాల్సిందిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయగా.. జూపల్లి స్పందించలేదు. ఉమ్మడి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా విషయంపై ఎమ్మెల్సీ కవిత ప్రశ్నలు సంధించగా... ఒక్క టిప్పర్ కూడా అక్రమంగా తిరగడం లేదంటూ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బదులిచ్చారు. కాగా ఇన్‌చార్జి మంత్రి ఈ విషయంపై నోరు మెదపకపోవడంపై చర్చ జరిగింది. సంక్రాంతి రోజు నిర్వహించిన పసుపు బోర్డు ప్రారంభోత్సవం బీజేపీ కార్యక్రమం మాదిరిగా జరిగిందని ఎమ్మెల్సీ కవిత తోపాటు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆక్షేపించారు. ఈ విషయంపై కేంద్రానికి లేఖ సంధించాలని నేతలు చెప్పగా.. మంత్రి జూపల్లి నోరు విప్పలేదు. కామారెడ్డి వ్యవసాయధికారి తిరుమల ప్రసాద్ తీరుపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### గడబిడ గందరగోళం..

ఉమ్మడి జిల్లా ప్రభుత్వాధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశం కాస్తా గడబిడ గందరగోళం అన్నట్లుగా సాగింది. వేదికపై ప్రొటోకాల్ పాటించలేదు. మేయర్‌కు సరైన స్థానం కల్పించలేదు. ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులతోపాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయాధికారులు సైతం హాజరు కావాల్సి ఉండగా.. చాలా మంది జిల్లా అధికారులు, మండల స్థాయి బాధ్యులు డుమ్మా కొట్టారు. సమన్వయ సమావేశం ఆద్యాంతం వేదికపై ఉన్న అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేల ప్రసంగానికే సరిపోయింది. సమన్వయ సమావేశానికి వచ్చిన అధికార యంత్రాంగమంతా కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఏ ఒక్క శాఖకు సంబంధించిన అధికారిని వివరణలు అడుగకపోవడంతో వచ్చిన వారంతా ఫోన్లలో చిట్‌చాట్ చేస్తూ కాలక్షేపం చేశారు. సెలవు దినం రోజున మీటింగ్ పెట్టడం, మూడు గంటల భేటీలో యంత్రాంగం పనితీరుపై ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమీక్షించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. సమావేశ మందిరంలోనూ వారు మోహరించారు.

### ఈ ప్రశ్నలకు బదులేదీ?

ఉభయ జిల్లాల విషయమై ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు పలు ప్రశ్నలు సంధించారు. అందుకు ఆయన సమాధానం చెప్పకపోవడం గమనార్హం. నిజామాబాద్‌లో 1.27లక్షల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా.. కేవలం 26వేల మందికే ఇస్తామనడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేయాలని, 4.43 లక్షల మంది రైతు కూలీలు ఉంటే కేవలం 41వేల మందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందని చెప్పడం సరికాదన్నారు. పథకాల ఎంపికలో రాజకీ జోక్యం తగదని హితవు పలికారు. పోలీసు కమిషనర్ లేకపోవడంతో శాంతి, భద్రతలు క్షీణిస్తున్నాయని, సీపీని ఎప్పు నియమిస్తారని ప్రశ్నించారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని, ఇప్పుడు కేవలం రూ.12వేలు ఇవ్వడం రైతులను మోసం చేయడమే అన్నారు. అంగన్‌వాడీలకు నెలకు రూ.13,500జీతం వస్తున్నదని, వీరి సంవత్సర ఆదాయం రూ.1,62,000కావడంతో రేషన్ కార్డుకు అర్హత కోల్పోతున్నారు. ఇలా చాలా మంది చిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. కామారెడ్డి వ్యవసాయాధికారి రుణమాఫీపై ఎమ్మెల్యేలకే సరైన సమాచారం ఇవ్వడం లేదని, ఆయనపై ఇన్‌చార్జి మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

### చతురత ప్రదర్శించిన కవిత, వేముల..

ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తమ చతురతను ప్రదర్శించారు. అధికారిక కార్యక్రమంలో తమదైన తీరులో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీశారు. సమావేశం ఎజెండా మేరకు పథకాల అమలులోని లోపాలను ఎత్తి చూపారు. ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. హుందాగా, మర్యాదగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను సంబోధిస్తూ కవిత, వేముల తమ ప్రసంగాన్ని కొనసాగించారు. తీవ్రమైన సమస్యలను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకురావడంతో పాటు తమదైన శైలిలో అధికార పార్టీపై వాగ్బాణాలు సంధించారు. నిజామాబాద్ నగర మేయర్ నీతూ కిరణ్‌కు సరైన ప్రొటోకాల్‌ను అధికారులు పాటించలేదు. సబ్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారుల పీఏలు, గన్‌మెన్లతో సభా వేదిక నిండుకోవడంతో అస్తవ్యస్తంగా కనిపించింది. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి తన ప్రసంగం మొదలు పెట్టడంతోనే రాజకీయ వ్యాఖ్యానాలు జోడించారు. మంత్రిని కేర్‌లెస్ అంటూ మాట్లాడడంతో కాస్త రగడ చోటు చేసుకున్నది. మంత్రి జూపల్లి కృష్ణారావును కేర్‌లెస్ అంటూ వ్యాఖ్యానించడంతో కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడం స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. మంత్రితో జాగ్రత్తగా మాట్లాడాలంటూ హితవు పలికారు.

# పోలీసు గెస్ట్‌హౌస్ ప్రారంభం

కామారెడ్డి, జనవరి 19: కామారెడ్డి పట్టణంలోని క్యాసంపల్లి శివారులోని పోలీసు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద నిర్మించిన పోలీసు గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. అతిథి గృహం ఏర్పాటుకు కృషి చేసిన డీజీపీకి స్థానిక పోలీసు అధికారులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మల్టీ జోన్ –1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు ఎస్పీ(అడ్మిన్) నరసింహారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ డాక్టర్ జితేందర్

# చద్మల్ తండాలో నకిలీ నోట్ల కలకలం

జాతరలో చెలామణి చేసినట్లు అనుమానాలు



చద్మల్ తండాలో వెలుగు చూసిన ఐదు వందల రూపాయల నకిలీ నోట్లు

గాంధారి, జనవరి 19: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని చద్మల్ తండాలో ఐదు వందల రూపాయల నకిలీ నోట్లు వెలుగు చూసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చద్మల్ తండాలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ రోజున లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, డబ్బులను తండాలో అవసరం ఉన్న వారికి వడ్డీకి ఇస్తారు. ఆలయానికి సంబంధించిన డబ్బులు సుమారు కోటి రూపాయల వరకు ఉన్నట్లు తెలిసింది. ఈ బాధ్యతను ఆలయ కమిటీలోని ఓ వ్యక్తి చూసుకుంటాడు. వడ్డీ డబ్బులను జాతర సమయంలో వసూలు చేసి, జాతర ముగిసిన అనంతరం తిరిగి వడ్డీకి ఇస్తారు. గతంలో డబ్బులు తీసుకున్న వారు ఈ ఏడాది జాతరకు ఇచ్చినట్లు తెలిసింది. ఈసారి లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం ముగిసిన అనంతరం డబ్బులను కొందరు తీసుకోగా.. అందులో నకిలీ నోట్లు వచ్చాయని తెలిసింది. ప్రతి యాభై వేల రూపాయల నోట్ల కట్టలో మూడు, నాలుగు నకిలీ నోట్లు ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై పలువురు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు తండాకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

# ఏ తల్లి నిను గన్నదో..!



చిక్లీ శివారులో లభించిన నవజాత శిశువు

- చెట్టు కింద ముళ్ల పొదల్లో నవజాత శిశువు
- వదిలివెళ్లిన గుర్తు తెలియని మహిళ
- మాక్లూర్ మండలం చిక్లీ శివారులో ఘటన

మాక్లూర్, జనవరి19: ఓ నవజాత శిశువును చెట్టుకింద వదిలి వెళ్లిన అమానవీయ ఘటన మండలంలోని చిక్లీ శివారులో ఆదివారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్లీ శివారులోని నందిపేట్ – జన్నేపల్లి రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టు పక్కన ముళ్ల పొదల్లో ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని మహిళ నవజాత శిశువు(ఆడ)ను వదిలి వెళ్లింది. అటుగా వాకింగ్‌కు వెళ్లిన యువకులు ఏడుపును విని శిశువు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని గ్రామ కార్యదర్శితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సహాయంతో శిశువును అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మానవత్వం లేని తల్లి ఈ ఘటనకు పాల్పడిందోనని ప్రజలు స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.